చెట్లు నరికితే కేసులే!


నారాయణపూర్‌లో రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లు


రాచర్ల గొల్లపల్లిలో చెట్లను నరికివేసిన సెస్ సిబ్బంది

- కఠినంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు
- జీపీలదే సంరక్షణ బాధ్యత
- ఎల్లారెడ్డిపేటలో వరుసగా జరిమానాలు


ఈ చిత్రంలో అనుమతులు లేకుండా హరితహారంలో నాటిన మొక్కలను నరికివేసిన ఎల్లారెడ్డిపేటకు చెందిన ఓ వ్యక్తికి పంచాయతీ అధికారులు జరిమానా విధించారు. రోడ్ల వెంట భవనాలు నిర్మిస్తున్న వ్యక్తులు అక్రమంగా చెట్లను తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన వారిని గుర్తించిన అధికారులు జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట: గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేందుకు అధికారులు, పంచాయతీ సిబ్బంది శ్రమిస్తున్నారు. అవి ఇప్పుడు ఏపుగా పెరిగి పల్లెలకు పచ్చదనంతో స్వాగతం పలుకుతుండగా, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను నరుకుతున్నారు. దీంతో అధికార యంత్రాంగం జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. మండలవ్యాప్తంగా గత ఆరునెలల్లో మొక్కలు నరికివేసిన 11 మందికి జరిమానా, ఇద్దరు సెస్ సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై సస్పెన్షన్ వేశారు. మొక్కల సంరక్షణే ప్రధాన లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి..

మండలంలో హరితహారంలో భాగంగా ప్రధాన రహదారులు, పొలంగట్లు, ప్రభుత్వ కారాలయాలు, పాఠశాలల ఆవరణల్లో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. మొక్కల సంరక్షణపై నిత్యం జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షించడంతోనే గ్రామాల్లో నేడు పచ్చదనం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మొక్కలను నరికివేస్తున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముస్తాబాద్‌లో మొక్కలను తిన్న మేకలను గ్రామ పంచాయతీలో బంధించి యజమాని రూ.2వేలు జరిమానా తీసుకోవడం మొక్కల సంరక్షణపై అధికారుల తీరును స్పష్టంచేస్తోంది. తాజాగా మండలంలోని రాచర్లగొల్లపల్లిలో విద్యుత్ మెయిన్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని, అనుమతులు లేకుండా చెట్లను నరివేసిన ఇద్దరు సెస్ సిబ్బందిపై కార్యదర్శి ఫిర్యాదు చేయగా, పోలీసులు వారిపై కేసునమోదు చేశారు.

ఆరునెలల్లో 11 మందికి జరిమానా

ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల వెంట ఏర్పాటు చేసిన ఎవెన్యూప్లాంట్ల మొక్కలే నరికివేతకు గురవుతున్నాయి. భవన నిర్మాణాలకు అడ్డుగా వస్తున్నాయన్న కారణంతో రాత్రికి రాత్రే చెట్లను తొలగిస్తున్నారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను సెస్ అధికారులు నరికివేస్తున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు ఆరునెలల వ్యవధిలో మండలంలో వివిధ సంఘటనల్లో 11 మందికి జరిమానాలు విధించి, ఇద్దరు సెస్ సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయడంతోపాటు నరికివేస్తున్న వారికి జరిమానాలు విధించడం, క్రిమినల్ కేసులు నమోదు చేయడం వంటివి చేస్తున్నారు. మండలంలో వరుసగా చెట్లను నరికివేస్తున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం


హరితహారంలో నాటిన మొక్కలు, వృక్షాలను అనుమతులు లేకుండా తొలగిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అత్యవసరమైతే తొలగించేందుకు ఇంటి యజమానులు సంబంధిత జీపీలలోదరఖాస్తులు చేసుకోవాలి. అనువతులు లేకుండా మొక్కలు నరికివేస్తే ఉపేక్షించేది లేదు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను సంరక్షించే బాధ్యత అందరూ తీసుకోవాలి.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

మాజీ సీఎం మహిళలకు క్షమాపణ చెప్పాలి

ఎల్లారెడ్డిపేట: మాజీ సీఎం కేసీఆర్ మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. మండలంలోని గుంటపల్లి చెరువుతండా, దేవునిగుట్టతండా, బాకూర్‌పల్లితండా గ్రామాల్లో సోమవారం జై బాపు.. జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. ఉచిత బస్సుతో మహిళలు జుట్లు పట్టుకుంటున్నారని మాజీ సీఎం అనడం సమంజసం కాదని, మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, బుచ్చాగౌడ్, బండారి బాల్‌రెడ్డి, జంగా అంజిరెడ్డి, ఎల్లాగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


గుంటపల్లి చెరువుతండాలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్రీవెన్స్ డేకు 18 ఫిర్యాదులు

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీస్ కార్యాలయానికి గ్రీవెన్స్ డే సందర్భంగా వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలని ఎస్పీ మహేష్ బి.గీతే అన్నాను. సోమవారం గ్రీవెన్స్ డే కు 18 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. బాధితులతో మాట్లాడిన అనంతరం వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆదేశించారు. చట్ట పరిధిలో సమస్యలు పరిష్కారం కావాలని, దానికి అవసరమైన విధానాలు అధికారులు అవలంబించాలని సూచించారు.

ఎరుకల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న కోనేటి పోచన్న

సిరిసిల్లకల్చరల్: ఎరుకల సామాజిక వర్గాన్ని అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షుడు కోనేటి పోచన్న కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఎరుకల కోసం కేటాయించిన విద్యాసంస్థల్లో పిల్లలకు ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా సీట్లు కేటాయించాలన్నారు. జిల్లాలో ఎస్టీ కమిషన్ ద్వారా అర్హులైన ఎరుకలకు సబ్సిడీ రుణాలిచ్చి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాలని కోరారు. త్వరలోనే భారీ బహిరంగ సభ ఏర్పాటు ద్వారా ఎరుకల డిమాండ్లను ప్రభుత్వానికి తెలుపుతామని చెప్పారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బిజిలి దేవయ్య, సలహాదారుడు కోనేటి ఉప్పలయ్య, భిక్షపతి, అనుముల పోశయ్య, కోనేటి శివ, ఎల్లయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజీవ్ వికాసం ఇంటర్వ్యూలు


ముస్తాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు


వీర్నపల్లి : దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన వారికి ప్రత్యేకంగా పంచాయతీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పోతుగల్ అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేశారు. ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రాజీవ్ యువవికాసం కింద వివిధ యూనిట్ల మంజూరుకోసం చేసుకున్న దరఖాస్తులను ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎస్సీ కార్పొరేషన్ కింద మండలంలో 279 మంది దరఖాస్తు చేసుకున్నారని, 239 హాజరైనట్లు తెలిపారు. బొప్పాపూర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆనంద్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ మంజూరు

ఇల్లంతకుంట: మండలంలోని వెల్జిపూర్‌లోని చౌడలమ్మ ఆలయానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బోరు మోటార్ మంజూరు చేశారు. గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. చౌడలమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా బోరు మోటారు కోసం రూ. లక్ష 50 వేలు నిధులు మంజూరుచేసినట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు నరిగె శ్రీనివాస్, గొల్ల కోమటి బాలయ్య, మల్లేశం, వెంకటేశం, కంకణాల రాంప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులు.. నాణ్యతకు తిలోదకాలు

- రాళ్లు, మట్టితో కూడిన ఇసుకతో పనులు


30 పడకల ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనుల కోసం స్టోరేజ్ చేసిన రాళ్లు, మట్టితో కూడిన ఇసుక

రుద్రంగి: మట్టి, రాళ్లు నిండిన ఇసుక.. సైజ్ తక్కువ కంకరతో నాణ్యత లేని పనులు చేపడుతున్నారు. రుద్రంగి ప్రజలు ముప్పై ఏళ్ల కల సాకారమవుతుందనే ఆనందం.. నాసిరకం పనులతో ఆవిరయ్యేలా ఉందనే చర్చ సాగుతోంది. రాళ్లు, మట్టితో కూడిన ఇసుకతో భవన నిర్మాణ పనులు చేస్తుండడంతో నాణ్య తపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.1.43కోట్లు మంజూరు


రుద్రంగి ప్రజల చిరకాల వాంఛ 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో రూ.1.43కోట్లు మంజూరయ్యాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

పర్యవేక్షిస్తున్నాం..


“ రుద్రంగి మండల కేంద్రంలో నిర్మించే 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. రాళ్లు, మట్టితో కూడిన లోకల్ ఇసుకను బిల్డింగ్ పనులకు పనికిరాదని రిజెక్టు చేశాం. నాణ్యమైన ఇసుకనే వాడాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. భవన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తే బిల్లులు నిలిపివేస్తాం.

– మనోహర్, పీఆర్ ఏఈ, రుద్రంగి

వేములవాడ సమాచారం


వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	01	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	01	336

– వేములవాడ


ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో ప్రధాన రహదారి పక్కనే మురుగునీరు నిలుస్తోంది. సింగిల్‌విండో కార్యాలయం నుంచి హనుమాన్ రైస్‌మిల్లు వరకు డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో ఇక్కడ మురుగునీరు ఇలా రోడ్డు వద్ద పారుతోంది. మురుగుకాల్వలు నిర్మించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
అఫర్, పంచాయతీ కార్యదర్శి, పోతుగల్ సెల్‌నెంబర్:9652409779

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఒకే గది.. మూడు కార్యాలయాలు

- కలెక్టరేట్‌లో ఇరుకిరుకు ఆఫీస్‌లు
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది
- ఇతర గదుల్లోకి సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి


కలెక్టరేట్‌లో ఒకే గదిలో మూడు ఆఫీస్‌లు

సిరిసిల్ల: జిల్లాలోని కలెక్టరేట్‌లో అధికారులు విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని బీవైనగర్‌లో ఉన్న చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫీస్‌ను కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులోకి మార్చారు. అదే కార్యాలయంలో ఇప్పుడు కొత్తగా హౌసింగ్ (గృహనిర్మాణ శాఖ) ప్రాజెక్టు డైరెక్టర్ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు. మరోవైపు వేములవాడలోని ఆలయ అద్దె భవనంలో మొన్నటి వరకు కొనసాగిన వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) కార్యాలయాన్ని కలెక్టరేట్‌లో ఇదే గదిలోకి తరలించారు. ఒకే గదిలో మూడు కార్యాలయాల సిబ్బందితో ఎలాంటి క్యాబిన్లు లేకుండా కొనసాగుతుంది. సిరిసిల్లకు చెందిన వస్త్రోత్పత్తిదారులు, నేత కార్మికులు జౌళిశాఖ ఆఫీస్‌కు వచ్చి అధికారులతో గట్టి(బిగ్గర)గా మాట్లాడుతుంటే.. హౌసింగ్, వీటీడీఏ అధికారులు ప్రశాంతంగా పని చేసుకోకుండా వాళ్లవైపు చూస్తూ కూర్చున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన లబ్ధిదారులు గృహనిర్మాణ శాఖ పీడీ వద్దకు వచ్చి ఏమైనా మాట్లాడుదామంటే.. మిగతా రెండు శాఖల అధికారులకు ఇబ్బందిగా మారింది. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే చోట ఉండడం మంచిదే అయినా.. ఇలా ఒకే గదిలో మూడు శాఖలు ఉండడం ఇబ్బందిగా ఉంది. కలెక్టరేట్ అధికారులు వాస్తవాలను పరిశీలించి ఖాళీగా ఉన్న ఇతర గదుల్లో ఒక్కోశాఖను సర్దుబాటు చేయాలని ఆయాశాఖల సిబ్బంది కోరుతున్నారు.

విద్యార్థులకు సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మనువాడ శంకర్ కూతురు మనువాడ శ్రీవిద్య ఇటీవల ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించింది. ఆమెను అనుపురం పాఠశాల ఉపాధ్యాయుడు విఠల్, రమేశ్, దేవేందర్, కిషోర్ ఘనంగా సన్మానించారు.


రుద్రంగి : విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపకులు

రుద్రంగి: రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం అధ్యాపకబృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కేలేటి మనస్విని, కీసరి అక్షయ, బైపీసీలో లంక దాసరి వైష్ణవి, బండారు అమూల్య, సీఈసీలో గండి నందిని, బొల్లి దీపిక, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో శైల లావణ్య, కటకం దీక్షిత, బైపీసీలో పొన్నూరు గాయత్రి, అక్కెనపల్లి మధుమిత, సీఈసీలో లక్కాకుల ప్రణవి, చెన్నూరి శివాని ప్రతిభ చాటగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకబృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లేశ్‌కు నివాళి

సిరిసిల్లటౌన్: పట్టణానికి చెందిన చెందిన సీపీఐ, ఏఐటీయూసీ జాతీయ నాయకుడు సామల మల్లేశం వర్ధంతి సందర్భంగా కార్మిక భవనంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, సీనియర్ నాయకులు నల్ల చంద్రమౌళి, మంత్రి చంద్రయ్య, సుంకనపల్లి శాంతాబాయి, గాజుల లింగం, నల్ల మార్కండేయులు, జంగం జనార్దన్, కోడం ప్రమీల తదతరులు పాల్గొన్నారు.

పూలే సినిమాను సెన్సార్ లేకుండా విడుదల చేయాలి

కోనరావుపేట: మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర, పోరాటం గురించి 'పూలే' సినిమాను అనంత్ మహదేవన్ తెరకెక్కించడం అభినందనీయమని, వాస్తవ చరిత్ర ఆధారంగా ఎలాంటి సెన్సార్ లేకుండా సినిమాను విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ అమర్ మహారాజ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు, సామ్రాట్ అశోక చక్రవర్తి, సంతు రవిదాస్, ఛత్రపతి శివాజీ, మహాత్మా జ్యోతిరావు పూలే, సాహుజీ మహరాజ్, కాన్షీరాం లాంటి మహనీయుల గురించిన పోరాటం ఎక్కడ వినబడకుండా కుట్ర పన్నుతున్నారన్నారు. పూలే సినిమా నుంచి ఎలాంటి కటింగులు చేయకుండా విడుదల చేయాలని, ఇందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలన్నారు.

తేనెటీగల దాడిలో బీఆర్‌ఎస్ నాయకులకు గాయాలు

తంగళ్లపల్లి: తేనెటీగల దాడిలో బీఆర్‌ఎస్ నాయకులు గాయాలయ్యాయి. మండలంలోని గోపాలరావుపల్లెకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభకు బస్సులో బయలుదేరారు. మానకొండూర్ శివారులో చెట్టుకింద భోజనం చేస్తుండగా తేనేటీగలు దాడిచేశాయి. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు కడారి తిరుపతి రెడ్డి, ఎడ్ల విశాఖ, అంబటి మల్లయ్య, ఎడ్ల నర్సయ్యకు గాయాలయ్యాయి. తిరుపతి రెడ్డిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా సోమవారం డిశ్చార్జ్ అయ్యాడు. తేనేటీగల దాడిలో బీఆర్‌ఎస్ నాయకులు గాయపడిన ఘటన తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గోపాలరావుపల్లెలో కడారి తిరుపతిని పరామర్శించారు. మాజీ రాష్ట్ర పవర్‌లూం కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, నాయకులు తదితరులున్నారు.

ఆరుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వాహనదారులపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణిస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్సై శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వర్ణకారులను ఆదుకోవాలి


దీక్షలు చేస్తున్న స్వర్ణకారులు

ముస్తాబాద్: స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ముస్తాబాద్‌లో చేపట్టిన దీక్షలు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. స్వర్ణకారులు మాట్లాడుతూ మండలకేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నెలకొల్పుతున్న జ్యువెలరీ దుకాణాలకు అనుమతులు ఇవ్వవద్దని కోరారు. ఇప్పటికే స్వర్ణకారులకు సరైన ఉపాధి లభించక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి దుకాణాలు వెలియడంతో స్థానిక స్వర్ణకారులు ఉపాధిని కోల్పోతారన్నారు. కలెక్టర్ స్పందించి మండల స్వర్ణకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

రేపు భూభారతిపై అవగాహన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 30న భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ సుజాత సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొని సమావేశం విజయవంతం చేయాలన్నారు.

నేడు అవగాహన

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ రైతువేదికలో మంగళవారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ సదస్సుకు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తదితరులు హాజరవుతున్నారని, అన్ని గ్రామాల రైతులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

వాటర్ ట్యాంక్ మరమ్మతు చేస్తాం

సాక్షి స్పందన

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని సోలార్ వాటర్ ట్యాంక్‌ను మరమ్మతు చేయిస్తామని ఎంపీడీవో బీరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షిలో 'మరమ్మతు చేయండి'అనే శీర్షికన సోలార్ వాటర్ ట్యాంక్‌పై కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీవో స్పందించారు. సోలార్ ద్వారా నీటిని అందించే సిస్టమ్ చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. మెకానిక్‌తో మరమ్మతు చేయించి, అంగన్‌వాడీ విద్యార్థులు, కాలనీవాసులకు నీరందిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలి

తంగళ్లపల్లి: పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగే కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల సెస్ ఆఫీస్ నుంచి గాంధీ చౌక్ వరకు పాదయాత్ర, కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు లహరి ఫంక్షన్ హాల్‌లో జిల్లాస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

'కుంగ్‌ఫూ'లో ప్రతిభ


ఇల్లంతకుంట: హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఈనెల 26, 27న కుంగ్‌ఫూ, మార్షల్ ఆర్ట్ పోటీలు నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి 30 మంది పాల్గొనగా స్పారింగ్, కటాస్, కర్రసాము, నాంచాక్, తల్వార్, విభాగంలో పోటీలు జరిగాయి. ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కొమ్ము రమేశ్ కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ చాటి బ్లాక్‌బెల్ట్ సాధించాడు. ఇండియన్ గ్రాండ్ మాస్టర్ సీహెచ్ మధునయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట: మండలంలోని ధర్మారం ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫిజికల్ డైరెక్టర్ వేణు ఒక ప్రకటనలో కోరారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీల్లో రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.ఆసక్తిగల క్రీడాకారులు 97044 44359లో సంప్రదించాలని కోరారు.

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడాశిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు కోచ్ భాను తెలిపారు. మే 1 నుంచి 31 వరకు హ్యాండ్‌బాల్ క్రీడపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, క్రీడాకారులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.